ఆదివారమంటే ఎందరికో ఆనందంగా ఉంటుంది కానీ ఆనందరావుకి అంటే ఎవరికో అనుకోకండి నాకే బెంగగా ఉంటుంది. నాకు ఎంత బెంగయినా వచ్చే ఆదివారాలు ఆగిపోవు కదా. అలాగే ప్రతీవారం లాగే ఈరోజూ ఆదివారం రానే వచ్చింది. మెలకువ వచ్చినా కళ్ళు తెరిచి బాహ్యాప్రపంచంలోకి రావటానికి అయిష్టం కావటంతో అలాగే పడుకున్నాను.

పెరట్లోంచి మాధవి గొంతు వినిపిస్తోంది. పనిమనిషితో మాట్లాడుతోంది. 'అయ్యో పాపం! నిన్ను అంతలేసి మాటలనడమే కాక చేయి కూడా చేసుకున్నాడా! అసలీ మగాళ్ళంతా దుర్మార్గులు. అసలు నువ్విలా వాడు కొట్టినా, తిట్టినా పడుండ బట్టే ఇంకా పెట్రేగి పోతున్నాడు. నాలుగిళ్ళల్లో పని చేసుకుంటున్నావు కదా. వాణ్ణి వదిలేసి నీ బతుకు నువ్వు బతక్కూడదూ? ఇంద ముందీ కాఫీ తాగు'

పనిమనిషి ఏం జవాబిస్తుందో అని చెవులు రిక్కించాను.


'అయ్యబాబోయ్ వదిలేయటమే. ఏమాటకామాటే చెప్పుకోవాలి. వాడిక్కాస్త ముక్కు మీద కోపం. కోపంలో ఏదో వాగుతాడే కానీ మళ్ళీ నేనంటే పేణమండీ. ఒక్క రోజు కూడా నన్నిడిసి ఉండలేడండీ. మొన్న అద్దాల జాకెట్టు నాకోసం కొని తెచ్చాడండీ. అది తొడుక్కుంటే రమ్యకృష్ణలాగున్నానని తెగ మురిసిపోయాడండీ. చిలకపచ్చ చీరె కట్టుకుని అద్దాల జాకెట్టు ఏసుకున్నానా! అంతటితో వదల్లేదండీ. పదపదమంటూ అదేంటి 'ఆవిడామా యావిడే' సిన్మాకు తీసుకెళ్ళాడు. మేం పచ్చగుండటం ఇష్టంలేక పక్క గుడిసెలో ఉండే సీతాలు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటోంది. మొన్నే కదే నిన్ను తిట్టింది, నీకు సిగ్గులేదే' అని మా ఇద్దరి మధ్య పుల్లలు పెట్టాలని చూస్తోంది. ఆడో మాట అంటే నేను నా క్కోపం వస్తే నాలుగు మాటలంటాను. అంతమాత్రాన ఆలుమగలు ఏరయిపోతామేంటి..?'

మాధవికి పనిమనిషి ఇన్‌డైరెక్ట్‌గా తననే చెరిగేస్తోందేమోననిపించింది కాబోలు. సర్లే పని కానీ , వాడు తిట్టి, కొట్టి మళ్ళీ నిన్ను బుట్టలో వేసుకోడానికి ఓ జాకెట్ ముక్క కొనిస్తే నువ్వు పొంగిపోతున్నావు. అదేమంటే పేణమంటావు, నా తలకాయంటావు. పైగా తీసుకెళ్ళిన సినిమా 'ఆవిడా మా ఆవిడే' నంటున్నావు. ఎందుకులే, నీకు చెప్పి లాభంలేదులే..' అంటూ లోపలికి వచ్చేసింది.

నేను క్రీగంట అదంతా గమనించి మళ్ళీ కళ్ళు మూసుకున్నాను. నాకు

# ఆదివారం-అర్ధాంగి!

-జె. శ్యామల



ఆ సాయంత్రం టీ.వి లో సినిమా మొదలైంది. 'ఏమండీ! మీరు కొట్టండి, చంపండి. నా తాళి బొట్టును మాత్రం ఇమ్మని అడక్కండి. అదొక్కటే నాకు మిగిలిన భాగ్యమండీ' హీరోయిన్ వెక్కిళ్ళు పెడుతోంది.

మాత్రం పనిమనిషి మాటలు బాగా నచ్చాయి. మొగుణ్ణి బాగా అర్థం చేసుకుందనుకున్నాను.

'స్వీటీ లే, లే. ఎంత సన్ డే అయినా ఎంత సేపు పడుకుంటావ్. ఎంత పొద్దెక్కినా నీకు, మీ నాన్నకు తెల్లారదు.' పాపను లేపుతోంది.

ఇక ఆ తరువాత నాకే 'సుప్రభాత పూజ' జరుగుతుందని తెలిసి వెంటనే లేచి బాత్‌రూమ్‌లోకి నడిచాను. 'ఈ ఆదివారమయినా మాధవితో హాయిగా గడపాలనుకున్నాను. త్వరగా పనులు తెముల్చుకుని భోజనాలు కానిచ్చి, కొద్దిసేపు రిలాక్సయి , ముచ్చట్లు చెప్పుకుని ఆపైన బయలుదేరి 'యాత్రిక్' దగ్గర టూరిస్ట్ బస్ ఎక్కి గోల్కొండ 'లైట్ అండ్ మ్యూజిక్ షో' చూసి రావాలని నా కోరిక. నా మనసులో మాట త్వరగా చెప్పేస్తే మంచిదనుకున్నాను.

కానీ నేను బయటకు వచ్చేసరికి మాధవి పేపరు చదువుతోంది.

'పాడు ప్రపంచం. ఒక్కొక్కణ్ణీ నరికి పోగులు పెట్టినా పాపంలేదు. ' ఆవేశంతో ఊగిపోతోంది.

ఇలాటి సమయాల్లో నేను మౌనం వహించినా ప్రమాదమే, మాట్లాడినా ప్రమాదమే అని నా అనుభవంలో తెలుసుకున్నాను. ఆ క్షణంలో అక్కడ నుంచి అదృశ్యమయ్యే అద్భుత శక్తి ఏదన్నా నాకుంటే ఎంత బాగుండు అని అనేక సార్లనుకంటాను. కానీ అది జరిగే పనా! భయపడుతూనే అడిగాను 'ఏమయిందీ?'

అంతే! ఉప్పెనలా విరుచుకు పడింది మాధవి.' ఏమయిందని తాపీగా అడుగుతున్నారా? లోకం తగలబడిపోయినా మీరు తొణక్కుండా కూర్చోగలరు. అవును. మీరు మగాళ్ళు కదూ. మీవి మనసులు కావు, పాషాణాలు. అందుకే చూడండి. ఈ ఫోటో. ఆ అమ్మాయి ఎంత బాగుందో, కట్నం తేలేదని నిద్రపోతున్న భార్యను కిరసనాయిలు పోసి నిప్పంటించాట్ట. ఎంత పాపాత్ముడండీ. అసలు అలాటి క్రూరుడని తెలిసీ ఆ పిల్ల ఎలా నిశ్చింతగా నిద్రపోయిందో? ఆ వెధవను అసలు ఉప్పు పాతర వెయ్యాలి'

ఆక్షణంలో మాధవిని చూస్తుంటే నాకు భయంగా ఉంది. నేనే నేరస్థుణ్ణి అయినట్లుగా నా వంక చూస్తోంది. నా ప్రోగ్రామ్ ప్రపోజల్ ఆమె ముందు పెట్టడానికి ధైర్యంచాల్లేదు. అయినా మాధవిని ఆ ధోరణి నుంచి తప్పించాలని, ధైర్యాన్ని కూడగట్టుకుంటూ 'అవన్నీ మనకెందుకు చెప్పు! నాకు కాస్త కాఫీ ఇవ్వకూడదూ.?' అన్నాను.

'ఏమిటీ మనకెందుకా? అయ్యో సాటి మనిషే అన్న భావన కూడా మీకు లేదు. అవున్లెండి. మీరూ మగాడేగా. ఆడవాళ్ళ మీద సానుభూతి చూపుతారనుకోవడం నా అవివేకం..ఇంకా ఏమనేదో కానీ 'మమ్మీ! నాకు రేపు తెలుగు టెస్ట్ ఉంది. చదువుకుంటా. నన్ను డిస్టర్బ్ చేయకు' అంది మా స్వీటీ.

ఆ క్షణంలో స్వీటీ నాకు దేవదూతలా అనిపించింది.

'నువ్వు చదువుకుంటానంటే నేనడ్డు చెబుతానా. చదువుకో..చదువుకో' అంటూ అక్కడ్నుంచి లేచింది మాధవి.

'అమ్మయ్య' అనుకున్నాను.

ఆ తర్వాత మాధవి ఇచ్చిన కాఫీ తాగుతూ పేపరు చూస్తున్నాను.

స్వీటీ వేమన పద్యం చదువుతోంది '..పురుషులందు పుణ్య పురుషులు వేరయా, విశ్వదాభిరామ వినుర వేమ' గట్టిగా చదువుతోంది.

మాధవి గబగబా వచ్చింది. 'ఎయ్ స్వీటీ! పుణ్య పురుషులు వేరయా కాదు, పుణ్య పురుషులు లేరయా' అని చదువు అంది.

'అదేంటి ఇక్కడలాగే ఉంది. మా టీచరు కూడా అలాగే చెప్పింది' స్వీటీ అమాయకంగా అంది.

'మీ టీచరు ఇంకా అజ్ఞానంలో ఉన్నట్టుంది. నేను చెప్పినట్లే చదువుకో..' ఆజ్ఞాపించింది మాధవి.

నేను కల్పించుకుని 'మధూ! స్వీటీని ఎందుకు ఇబ్బంది పెడతావ్. అదలా రాస్తే వాళ్ళ టీచరు ఊరుకుంటుందా, మార్కులు వేస్తుందా? ' అన్నాను.

'అసలు నాకే పవరుంటే ఈ చెత్త సిలబస్ అంతా మార్చేసేదాన్ని.ఛీ, ఛీ. ఏం చదువులో, ఏమిటో' అంటూ లేచి అవతలకు వెళ్ళింది.

'అమ్మయ్య' అనుకున్నాను. నా ప్రోగ్రామ్ మాట నా గొంతులోనే ఉండిపోయింది.

ఆ తర్వాత కొద్ది సేపటికి టీ.వి. ఆన్ చేసింది. ఏదో యాడ్ వస్తోంది. వేసుకున్న డ్రెస్ పాతగా కనిపించటంతో ఫారిన్ వెళ్ళే అవకాశం చేజారిందట. ఆవిడ మళ్ళీ మరో డిటర్జెంట్‌తో వాటిని ఉతికింది. అతను అవి వేసుకు వెళ్ళగానే ఆ తళతళలకు ఆ అవకాశం వచ్చి చేతుల్లో వాలింది.

మాధవి అందుకుంది. 'ఛీ,ఛీ. వాడికి బట్టలు ఉతికి ఇవ్వడమే ఆమె జీవితమా? డ్రై క్లీనింగ్‌కు వేసుకోలేడూ? '

ఆ తర్వాత అదేదో బ్రాండ్ నూనెతో కమ్మటి భోజనం కోడలు వండిపెడితే అత్తవారింట్లో అందరూ ప్రశంసిస్తూ కుర్చీల్లో కూర్చుని తింటుంటే కోడలు ఉబ్బి తబ్బిబ్బయిపోతూ పక్కనే నిలబడి



ఉంటుంది.

'వెధవది చివరకు వంటమనిషిగా గుర్తించారా? కోడలంటే టీ పెట్టడం, వంట చేయడం, బట్టలు ఉతకడమేనా? వెధవ బుద్ధులు, వెధవ బుద్ధులు' మళ్ళీ నేను పుస్తకాన్ని ఆశ్రయించాను.

కాసేపటికి ఎదురింటావిడ వడియాలు పెడుతోంది.

ఆయన పెరట్లో చెట్లను చూస్తూ పచార్లు చేస్తున్నాడు.

మాధవి చూడనే చూసింది. 'ఆవిడ చెమటలు కక్కుకుంటూ వడియాలు పెడుతుంటే ఆయన చూడండి కులాసాగా పచార్లు చేస్తున్నాడు. మళ్ళీ రేపు 'ఇంకాస్త వేగితే బాగుండేదేమో' అంటూ వడియాలను ఖాళీ చేసేది ఆయనే. ఛీ,ఛీ.'

'ఆయనలా అంటాడని నీకెలా తెలుసు మధూ' అడిగాను.

'ఎలా ఏమిటి ఆవిడే అందోసారి ఏది చేసిపెట్టినా ఒక వంకపెట్టి మరీ తింటాట్ట. ఆయన వంక పెట్టకుండా చేయాలని ఆమె తిప్పలు పడుతోందట. పిచ్చిది. కావాలని వంక పెడుతున్నాడని తెలుసుకోదు' అంది.

'ఇంక లాభంలేదు. ఈ వారానికి నా కోరిక తీరదు' నిస్పృహ ఆవరించింది.

ఆ సాయంత్రం టీ.వి.లో సినిమా మొదలైంది. 'ఏమండీ! మీరు కొట్టండి, చంపండి. నా తాళి బొట్టును మాత్రం ఇమ్మని అడక్కండి. అదొక్కటే నాకు మిగిలిన భాగ్యమండీ' హీరోయిన్ వెక్కిళ్ళు పెడుతోంది.

'వీల్లేదు. అది కట్టింది నేను. దాని మీద హక్కులన్నీ నావే. ఇచ్చేయమంటున్నా ఇచ్చెయ్' మీదపడి లాక్కుంటున్నాడు హీరో.

'ఛీ.ఛీ.తీసి వాడి మొహాన కొట్టక దేబెరిస్తుందేమిటి' టీ.వి.ని ఆఫ్ చేసింది.

వచ్చే నవ్వును మాధవి చూడకుండా ఉండటానికి చాలా కష్టపడ్డాను.

స్వీటీ మొదలు పెట్టింది. మమ్మీ! రేపు స్కూల్లో అందరూ ఏం పిక్చర్ చూశావని అడుతుతారే. మనమూ సినిమా కెళ్దాం మమ్మీ!' జాలిగా అడిగింది.

స్వీటీ మాటలకు కాస్త కరిగింది మాధవి. 'దగ్గరి హాల్స్ లో ఏమున్నాయ్' నన్ను అడిగింది.

'ఒకదాంట్లో 'ఏమండీ మళ్ళీ పెళ్ళి చేసుకోండి. ఇంకో దాంట్లో 'ఆవిడా మా ఆవిడే'. చెప్పాను.

'ఛీ..ఛీ..ఏం సినిమాలో ఏమిటో. స్వీటీ హాయిగా కార్టూన్ షో చూసుకో అమ్మా. మంచి పిక్చర్ వచ్చినప్పుడు వెళ్దాంలే' అంది.

'ఎప్పుడూ ఇంతే' సణుగుతూ వెళ్ళింది స్వీటీ.

ఆపైన లేటుగా ఇల్లు చేరిన పక్కింటి మొగుడి పాడుబుద్ధిని కాసేపు తిట్టుకుంది. పక్కింటి ఆమె సహనానికి జాలిపడింది. ఆపైన నీరసం వచ్చింది కాబోలు 'రండి అన్నాలు తినేద్దాం' అంది.

అదే బెటరనుకుని ఆరగింపులు కానిచ్చాం.

కాసేపు 'చంపక్' పుస్తకం చదివి స్వీటీ నిద్రపోయింది.

'మధూ! అదివారం అయిపోయినట్లేనా' అన్నాను.

'అంటే' అంది అమాయకంగా.

'అదే ప్రతి ఆదివారం లోకం అందరి గురించి బాధపడిపోతూ, ఆవేశపడిపోతూ నా గురించి, సారీ మన గురించి మరిచిపోతావ్ కదా. ఇప్పుడైనా మన ప్రేమ సీమల నేలుతారేమో రాణీగారని, నా ఛోటీసీ బాత్‌ని వింటారేమోనని ఆశ' అన్నాను.

మాధవి మూడ్‌లోకి వచ్చిందనటానికి గుర్తుగా ఆమె కళ్ళలో ప్రేమదీపాలు వెలిగాయి. పెదవులపై అపురూపమైన నవ్వుల పూవులు విరిశాయి.ఇంకేం నా గుండెల్లో సంతోషాల పూలజల్లు..నేనూ, ఆమె., ఆమె, నేనూ..నేనే ఆమె, ఆమే నేను.